క్లుప్తంగా

గో సంరక్షణ ట్రస్ట్‌కు విరాళం

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో గో సంరక్షణ ట్రస్ట్‌కు శనివారం సాయంత్రం ప్రకాశం జిల్లా చీరాలకు చెందిన శేఖర్ బాబు రూ.లక్ష విరాళాన్ని ఆలయ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కు అందజేశారు. వారికి స్వామివారి ప్రత్యేక దర్శనం అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో ఉద్యోగులకు మెమోలు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో చిత్తూరు అర్బన్ డివిజన్ పరిధిలోని సెక్షన్లలో విధి నిర్వహణలో అలసత్వం, బ్రేకటింగ్ చేయని కారణంగా 9 మంది ఉద్యోగులకు ఈఈ పద్మనాభ పిళ్లై శనివారం మెమోలు జారీ చేశారు. చిత్తూరులోని కొంగారెడ్డిపల్లె సెక్షన్‌లో ఏఈ, లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మన్, గుడిపాల మండలంలోని కొత్తపల్లెమిట్ట సెక్షన్ ఏఈ, లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మన్, చిత్తూరు రూరల్ ఏఈ, లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మన్‌కు మెమోలు అందజేశారు. వీరంతా మంగళవారం సాయంత్రం లోపు సంజాయిషీ ఇవ్వాలని ఉత్తర్వుల్లో ఆదేశించారు.

సచివాలయం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ

చిత్తూరు రూరల్: చిత్తూరులో వెంగళరావు కాలనీలోని సచివాలయాన్ని జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి శనివారం తనిఖీ చేశారు. లబ్ధిదారుల జాబితా, అటెండెన్స్, మూవ్‌మెంట్ రిజిస్టర్లను పరిశీలించారు. విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

జాబ్‌మేళాలో విద్యార్థుల ప్రతిభ



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని విజ్ఞానసుధ డిగ్రీ కళాశాలలో శనివారం జాబ్‌మేళా నిర్వహించినట్లు ఆ కళాశాల వైస్ చైర్మన్ శ్రీధర్ విలేకరులకు తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి నిర్వహించిన ఈ మేళాలో 9 ప్రముఖ కంపెనీలు పాల్గొన్నాయని, ప్రతిభ చాటి 318 మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందారని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, పలు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

9న కళామందిర వార్షికోత్సవ పోటీలు

పలమనేరు: పట్టణ సమీపంలోని కళామందిరం వార్షికోత్సవం సందర్భంగా జులై 9వ తేదీన పిల్లలకు వివిధ రకాల పోటీలను నిర్వహించి బహుమతులను అందజేయనున్నట్లు స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి నిర్వాహకులు తులసీనాథం నాయుడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలుగుభాష రక్షణకు తీసుకోవాల్సిన చర్యలు అనే అంశంపై ఏడు నుంచి పది తరగతుల పిల్లలు రెండు పేజీల వ్యాసం, 1 నుంచి 6 తరగతుల పిల్లలు ఇదే అంశంపై చిత్రలేఖనం, వందకుపైగా నీతి పద్యాలు చెప్పగలిగే పిల్లలు 9346249011 నంబరుకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని అందులో సూచించారు.

డిఫెన్స్ మద్యం స్వాధీనం

పలమనేరు: బెంగళూరు నుంచి బస్సులో నెల్లూరుకు తీసుకెళ్తున్న డిఫెన్స్ అకాడమీకి చెందిన 40 ఫుల్ బాటిళ్లను స్థానిక సెబ్ పరిధిలోని సరిహద్దు చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నారు. శనివారం తనిఖీలు చేపట్టిన సెబ్ అధికారులు వీటిని గుర్తించారు. ఇందుకు కారణమైన నెల్లూరుకు చెందిన సత్యనారాయణ(45)ను అరెస్ట్ చేసి మద్యాన్ని సీజ్ చేశారు. నిందితున్ని రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్టు సెబ్ సీఐ ఎల్లయ్య తెలిపారు.

ఇళ్ల స్థలాల కోసం గుడారాలు

రామకుప్పం: మండలంలోని బూరుగుమాకుల పల్లె ప్రభుత్వ స్థలంలో తమకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ శనివారం గ్రామస్తులు గుడిసెలు వేసుకున్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామ సమీపంలో 1.64 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉన్నట్లు తెలిపారు. 2022వ సంవత్సరంలో ఈ భూమిలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్, బల్క్‌మిల్క్ సెంటర్ భవనాల ఏర్పాటుకు 35 సెంట్లను రెవెన్యూ అధికారులు కేటాయించారని పేర్కొన్నారు. ఈ భూమి విషయమై అదే గ్రామానికి చెందిన వ్యక్తి కోర్టులో కేసు వేయడంతో ప్రభుత్వ భవనాల నిర్మాణాలు ఆగిపోయాయని, మిగిలిన భూమిలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని తాము గుడిసెలు వేసుకున్నట్లు తెలిపారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ మురళీ సిబ్బందితో కలసి అక్కడికి చేరుకున్నారు. ఇళ్ల స్థలాలను అర్హులకు అందజేస్తామని, రెవెన్యూ అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణాలు చేపట్టకూడదన్నారు. ఇళ్ల స్థలాల విషయమై జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపామని, కలెక్టర్ ఆదేశాల మేరకు అర్హులకు ఇంటిపట్టాలు మంజూరు చేస్తామన్నారు.

బీమా పథకాలతోనే భద్రత





దిగువమాఘంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ తులసి, హాజరైన స్వయం సహాయక సంఘాల సభ్యులు

- డీఆర్‌డీఏ పీడీ తులసి

తవణంపల్లె: బీమా పథకాలతోనే ప్రతి ఒక్కరికీ సామాజిక భద్రత కలుగుతుందని చిత్తూరు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ డీఎంకే తులసి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా పథకంపై శనివారంమండలంలోని దిగువమాఘంలో స్వయం సహాయక సంఘ సభ్యులు, బ్యాంకు ఖాతాదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పీడీ తులసి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ కుటుంబ భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏడాదికి రూ.456 ప్రీమియం చెల్లించి బీమా చేసుకోవాలన్నారు. బీమా చేసుకున్న వ్యక్తులు ఒకవేళప్రమాదవశాత్తు మరణిస్తే రూ.6 లక్షలు, సాధారణ మరణం సంభవిస్తే రూ.4 లక్షలు బీమా రూపేణా చెల్లిస్తారన్నారు. అలాగే శాశ్వత అంగవైకల్యం కలిగితే రూ.2 లక్షల పరిహారం అందుతుందన్నారు. ఇండియన్ బ్యాంకు జనరల్ మేనేజర్ వెంకటేశం మాట్లాడుతూ, తమ బ్యాంకులో ఖాతా ఉన్న ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇండియన్ బ్యాంకు తిరుపతి జోనల్ మేనేజర్ సెల్వరాజ్, డిప్యూటీ జోనల్ మేనేజర్ రాజేష్, చిత్తూరు ఎల్‌డీఎం హరీష్, దిగువమాఘం ఇండియన్ బ్యాంకు సిబ్బంది, ఏపీఎం రవి, ఎస్‌హెచ్‌జీ సభ్యులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'ఫ్యామిలీ డాక్టర్' సేవలు





ఐరాల : వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత, గుడిపాల: చలిచీమలపల్లెలో..

ఐరాల: మండలంలోని ఇరువారంపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. శనివారం స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పూర్ణలత 104 వైద్య శిబిరంలో రోగులు, గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం దీర్ఘకాలిక రోగుల ఇళ్లకే వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని సలహాలు–సూచనలు ఇచ్చారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సుగుణవతి, హెల్త్ సూపర్‌వైజర్ శంకరమ్మ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



తవణంపల్లె : చారాలలో..

చారాలలో..

తవణంపల్లె: గర్భవతులు ప్రతి నెలా క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ కోరారు. శనివారం మండలంలోని చారాలలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. రోగులకు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులు, గర్భవతులకు వైద్య పరీక్షలు చేశారు. మందులు పంపిణీ చేశారు. గర్భిణులు రక్తహీనత బారిన పడకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చలిచీమలపల్లెలో..

గుడిపాల: మండలంలోని ప్రతి గ్రామంలో వైద్యసేవలు అందిస్తున్నామని డాక్టర్ సందీప్ అన్నారు. శనివారం చలిచీమలపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 65 మంది రోగులకు చికిత్స చేశారు. మందులు పంపిణీ చేశారు. వైద్యసిబ్బంది దివ్య శిల్ప, శ్రీలత, కిరణ్‌కుమారి పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

చిత్తూరు కలెక్టరేట్: ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వినాయకం తెలిపారు. శనివారం స్థానిక డీఈఓ కార్యాలయం పక్కనున్న ప్రభుత్వ పాఠశాలలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, జిల్లా అధ్యక్షునిగా బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా మురళి, గౌరవ అధ్యక్షులుగా చిన్నస్వామి తదితరులను ఎన్నుకున్నట్లు వెల్లడించారు.

19న జిల్లా క్రిస్టియన్ మైనారిటీల మహాసభ



మాట్లాడుతున్న అసోసియేషన్ సభ్యులు

చిత్తూరు రూరల్: ఈనెల 19న నిర్వహించ తలపెట్టిన జిల్లా క్రిస్టియన్ మైనారిటీల సభను విజయవంతం చేయాలని జిల్లా క్రిస్టియన్ మైనారిటీ అసోసియేషన్ అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ కె.జాషువా, ప్రధాన కార్యదర్శి ప్రసాద్ కోరారు. శనివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. చిత్తూరులోని అంబేడ్కర్ భవనంలో ఈ సభను ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు. ముఖ్య అతిథిగా అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు హాజరవుతారన్నారు. క్రిష్టియన్లు హాజరై సభను జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

లబ్ధిదారులు ఇళ్లు నిర్మించకపోతే పట్టాలు రద్దు



జగనన్న కాలనీలో ఇళ్ల పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాజశేఖర్‌రెడ్డి

గుడిపాల: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు పూనుకోని పక్షంలో ఇంటి పట్టాలు రద్దు చేస్తామని ఎంపీడీఓ రాజశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం ఆయన రెట్టగుంటలోని జగనన్న లేఅవుట్‌ను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. ఇప్పటికీ ఇళ్ల పనులకు ఉపక్రమించని వారు నిర్మాణ పనులు ప్రారంభించాలని లేనిపక్షంలో జూలై 31న అన్నింటినీ రద్దు చేస్తామన్నారు. ఇదే విషయమై లబ్ధిదారులకు అవగాహన కల్పించి, పనులు చేపట్టేలా చూడాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్ సాయిమహేష్‌ను ఆదేశించారు. డ్వాక్రా మహిళలకు అదనంగా బ్యాంక్ లింకేజీ ద్వారా ప్రభుత్వం రూ.35 వేలు పావలా వడ్డీకి ఇస్తోందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ మురళీకృష్ణ, హౌసింగ్ ఏఈ గణేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ధనంజయులు పాల్గొన్నారు.

కల్వర్టును ఢీకొన్న కారు

- 9 మందికి గాయాలు



ధ్వంసమైన కారు (ఇన్‌సెట్) గాయపడిన దినేష్

చంద్రగిరి (తిరుపతిరూరల్): పూతలపట్టు– నాయుడుపేట జాతీయ రహదారిపై శనివారం ఐతేపల్లె వద్ద కారు టైరు పంక్చర్ కావడంతో అదుపుతప్పి కల్వర్టును ఢీకొంది. తొమ్మిది మంది గాయపడ్డారు. తమిళనాడులోని తిరువణ్ణామలైకి చెందిన ఏలుమలై కుటుంబీకులు కారులో రెండు రోజుల క్రితం తిరుమల వచ్చారు. తిరిగి వెళుతుండగా ప్రమాదం జరిగింది. డ్రైవర్ దినేష్‌కు తీవ్ర గాయాలు కాగా, ఏలుమలై, పరమేష్, అరుణ్‌కుమార్, ప్రతాప్, జయ, చిత్ర, ధనుష్, ఆర్తి స్వల్పంగా గాయపడ్డారు. వారిని 108లో తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

అర్జున తపస్సు



అర్జున తపస్సు ఘట్టాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

చిత్తూరు రూరల్: మహాభారత యజ్ఞంలో భాగంగా చిత్తూరు నగర పరిధిలోని కనికాపురంలో శనివారం అర్జున తపస్సు ఘట్టాన్ని కళాకారులు ప్రదర్శించారు. గంటపాటు ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. అనంతరం స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేసి నగర వీధుల్లో ఊరేగించారు.

ఘనంగా కాణిపాక ఆలయ చైర్మన్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి దంపతులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం రాత్రి అగరంపల్లెలోని ఆయన స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. అధికారుల నడుమ ఆలయ చైర్మన్ దంపతులు కేక్ కట్‌చేశారు. ఆలయ ఈఓ వెంకటేశు, ఎస్‌ఐ శ్రీనివాసులు, పలువురు ఆలయ అధికారులు చైర్మన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తొలుత చైర్మన్ దంపతులు వరసిద్ధుని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

పలమనేరు: చుట్టుపక్కల గ్రామాల నుంచి నిత్యం మార్కెట్‌కు బైక్‌లపై వచ్చే రైతులను వాహనాల తనిఖీ పేరిట జరిమానాలు వేసి ఇబ్బందులు పెట్టరాదని గంగవరం మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. హైవేలో వెళ్లే వాహనాలను తనిఖీ చేస్తే బాగుంటుందన్నారు. కానీ రకరకాల పనులపై నిత్యం పట్టణానికి వచ్చే సామాన్యులు, రైతులపై పోలీసులు ప్రతాపం చూపుతున్నారని, ఇది సరికాదన్నారు. ముఖ్యంగా కానిస్టేబుళ్లు జనంతో మాట్లాడే భాష అమర్యాదగా ఉంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తాము ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

ఆదమరిస్తే ఆస్పత్రికే..!





మొరం వద్ద రోడ్డు పక్కన ప్రమాదాలకు కారణమవుతున్న కేబుల్ గుంతలు

పలమనేరు: కుప్పం–పలమనేరు రహదారిలో ఆదమరిచి డ్రైవింగ్ చేశారో రోడ్డు పక్కన ఉన్న గుంతల్లో పడి కాలో.. చేయో విరుచుకుని వైద్యం కోసం అంబులెన్స్‌కు కాల్ చేయాల్సిన పరిస్థితి కలుగుతోంది. పట్టణ సమీపంలోని క్యాటిల్‌ఫామ్ నుంచి బైరెడ్డిపల్లె వరకూ ఓ ప్రైవేట్ నెట్‌వర్క్ కంపెనీ కేబుల్ వైర్లను ఏర్పాటు చేస్తున్నారు. వీరు అక్కడక్కడా సైడ్ బోరు యంత్రాలను వాడుతున్నారు. వీటి కోసం గుంతలు తవ్వారు. మరికొన్ని చోట్ల కూలీల ద్వారా గుంతలు తవ్విస్తున్నారు. పనులు ముగిశాక ఈ గుంతలను వెంటనే పూడ్చకుండా అలాగే వదిలేస్తున్నారు. దీంతో నక్కపల్లె, మొరం, దొడ్ల డెయిరీ, గొల్లపల్లె, కొలమాసనపల్లె తదితర గ్రామాల వద్ద రోడ్డుకు ఆనుకుని ఉన్న గుంతలు దగ్గరకు వెళ్తే గానీ వాహన చోదకులకు కనిపించవు. పొరబాటున సైడ్‌కు వాహనాన్ని దించితే ఆ గుంతలో పడి బైక్‌లు అదుపు తప్పి ప్రమాదాలకు దారితీస్తున్నాయి. ఆటోలు, కార్లు సైతం అదుపు తప్పుతున్నాయి. ఇప్పటికే పలు ప్రమాదాలు జరిగి కొందరు గాయాలపాలయ్యారు. ఇంత జరుగుతున్న సంబంధిత హైవే అధికారులు దీని గురించి పట్టించుకోవడం లేదని వాహనచోదకులు మండిపడుతున్నారు.

సకాలంలో టీకాలు వేయించాలి

తవణంపల్లె: పిల్లలకు సకాలంలో టీకాలు వేయించాలని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ ధాత్రేయచౌదరి ఆదేశించారు. శనివారం తవణంపల్లె పీహెచ్‌సీలో వైద్యసిబ్బందితో ఆమె సమీక్షించారు. సీడీఎన్‌సీడీ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పిల్లలకు ఐరన్ మాత్రలను వారానికో రోజు మింగించాలన్నారు. హైరిస్క్ గర్భవతుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ మోహన్‌వేలు, పీహెచ్‌ఎన్ భారతి, హెల్త్ సూపర్‌వైజర్లు అమరావతి, జయమ్మ, రాజశేఖర్, హరి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

చిత్తూరు రూరల్: శానిటేషన్, సెక్యూరిటీ, సూపర్‌వైజర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని శనివారం ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్‌ను కలిసి వారు విజ్ఞప్తి చేశారు. ఆస్పత్రిలో పనిచేసే సిబ్బందికి యూనిఫాం, గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. సకాలంలో వేతనాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, శంకరయ్య, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశుబీమా పథకాన్ని వినియోగించుకోండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

చిత్తూరు కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పశు బీమా పథకాన్ని అర్హులు వినియోగించుకోవాలని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. జిల్లా కేంద్రంలోని నాగయ్య కళాక్షేత్రంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో పశు బీమా పోస్టర్లను డిప్యూటీ సీఎం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతుల మేలు కోరి వైఎస్సార్ పశుబీమా పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ పథకం సంబంధిత శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో విరివిగా ప్రచారం చేసి అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రెడ్డెప్ప, కలెక్టర్ షణ్మోహన్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



తుంబపాళెం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఆణిముత్యాలకు సన్మానం

బంగారుపాళెం: విద్యార్థులు చదువుల్లో ప్రతిభ చాటి ఉన్నత శిఖరాలను అందుకోవాలని తుంబపాళెం సర్పంచ్ ఉషశ్రీ పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. 10వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన కార్తీక్, చిట్టిబాబును సన్మానించారు. వారికి నగదు ప్రోత్సాహకాలు, మెడల్స్‌ను అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ, విద్యారంగంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గ్రామీణ ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెచ్‌ఎం చిట్టెమ్మ.. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ భాస్కర్, వైస్ చైర్‌పర్సన్ ధనమ్మ, కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అలరించిన 'శ్రీకృష్ణ రాయబారం'





శ్రీకృష్ణ రాయభారం నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు, ద్రౌపదీ కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదమరి: మండలంలో చెన్నారెడ్డిపల్లెలోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయం వద్ద నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా శనివారం రాత్రి అట్టహాసంగా నాటక ప్రదర్శన మొదలైంది. కుంభం పలు గ్రామాలలో భీముని బండి ఊరేగింపు అనంతరం నాటక ప్రదర్శనకు తెరదీశారు. కళాకారులు ద్రౌపదీ ధర్మరాజుల ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి శ్రీకృష్ణ రాయభారం నాటకాన్ని ప్రదర్శించారు. గ్రామస్తులు తిలకించారు.

కల్యాణం.. కమనీయం

యాదమరి: మండలంలోని చెన్నారెడ్డిపల్లెలో నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా శనివారం రాత్రి ద్రౌపదీ ధర్మరాజుల ఆలయంలో ద్రౌపదీ కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. పాండవుల విగ్రహాలను పెళ్లి కుమారులుగా, ద్రౌపదీ దేవిని పెళ్లి కుమార్తెగా అలంకరించి, పెళ్లి పీటలపై కొలువు తీర్చారు. భక్త జన సందోహం నడుమ కల్యాణోత్సవం నిర్వహించారు.

యథేచ్ఛగా చెరువుల్లో మట్టితీత

- పట్టించుకోని ఇరిగేషన్ శాఖ



బంగారక్క చెరువులో మట్టిని తీస్తున్న జేసీబీ

గుడిపాల: అనుమతులు పొందకనే చెరువుల్లో మట్టిని యథేచ్ఛగా తవ్వి తరలిస్తున్నారు. దీనిపై గ్రామస్తులు అనుమతుల విషయమై నిలదీస్తే వాహనాలతో సహా మరో చెరువుకు ఉడాయిస్తున్నారు. వివరాలు.. మండలంలోని చెన్నై–బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే పనులను మోంటో కార్లో అనే ప్రైవేట్ సంస్థ చేస్తోంది. రోడ్డు పనులకు అవసరమైన మట్టిని అనుమతులు పొందకనే ఎక్కడపడితే అక్కడ మట్టిని తవ్వేస్తున్నారు. గుడిపాలలోని బంగారక్కచెరువు, 189 కొత్తపల్లె, చుక్కావారిపల్లె, రెట్టగుంట, చలిచీమలపల్లె వద్ద ఉన్న చెరువుల్లో మట్టిని ఇష్టారాజ్యంగా తీసి తరలిస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కిక్కిరిసిన గొర్రెల వారపుసంత



బైరెడ్డిపల్లెలో వారపుసంతకు తీసుకువచ్చిన గొర్రెలు, రైతులు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న గొర్రెపొట్టేళ్లు

బైరెడ్డిపల్లె: ఈనెల 29న బక్రీద్ పండుగ సందర్భంగా బైరెడ్డిపల్లెలో శనివారం నిర్వహించిన గొర్రెల వారపు సంత కిక్కిరిసింది. బక్రీద్ పండుగ కోసం గత కొంతకాలంగా రైతులు వ్యవసాయ పొలాల వద్ద గొర్రెలను ఏపుగా పెంచుతున్నారు. బక్రీద్ పండుగ సమీపిస్తుండడంతో గొర్రెలను వారపు సంతకు తీసుకువచ్చారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వ్యాపారులు అధిక సంఖ్యలో వారపుసంతకు హాజరయ్యారు. జత పొట్టేళ్లు రూ.70 వేల నుంచి రూ.1.20 లక్షలు పలికాయి. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.